వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలి

- తక్కువ వేగంతో, కచ్చితమైన దూరం పాటించాలి
- రంగారావు, రీజనల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్



చలికాలంలో రాత్రి సమయంలో, వేకువ జామున వాహనాలు జాగ్రత్తగా నడపాలి. ఎదురుగా వచ్చేవారికి స్పష్టంగా కనిపించేలా లైట్లను ఆన్ చేసి ఉంచాలి. లోబీమ్ ఫాగ్‌లైట్లు ఉండేలా చూసుకోవాలి. తక్కువ వేగంతో వెళ్లాలి. వాహనాల మధ్య ఖచ్చితమైన దూరం పాటించాలి. విండ్ స్క్రీన్, సైడ్ మిర్రర్లపై ఎప్పటికప్పుడు మంచును శుభ్రం చేయాలి. కారు, ఇతర పెద్ద వాహనాల్లో అద్దంపై మంచు పొర కమ్ముకోకుండా డీఫ్రాస్టర్ వినియోగించాలి. రోడ్లు స్పష్టంగా కనిపించకపోతే సురక్షితమైన స్థలంలో వాహనం నిలిపివేయడం మంచిది. అది ఇతర వాహనాలకు కనిపించేలా ఉండాలి. పొగమంచు దృష్ట్యా రాత్రి 10.30 నుంచి ఉదయం 7 వరకు దూర ప్రయాణాలు తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలి. కుటుంబాలతో ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు రాత్రి ప్రయాణం చేయొద్దు. పెద్ద వాహనాలు, ట్రక్కులు రోడ్డు పక్కన నిలపొద్దు. సరైన జాగ్రత్తలు పాటించి క్షేమంగా గమ్యాన్ని చేరుకోవాలి.

బహిరంగ ప్రదేశాల్లో ఉంచొద్దు

- ఓవర్ కూల్ అయి బ్యాటరీ డ్రైయిన్ అవుతుంది
- దినేశ్, మొబైల్ టెక్నీషియన్



కొద్ది రోజులుగా చలి విపరీతంగా పెరుగుతోంది. చలికాలం నేపథ్యంలో ఎలక్ట్రానిక్ వస్తువుల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. మొబైల్స్ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను బహిరంగ ప్రదేశాల్లో ఎక్కువసేపు ఉంచొద్దు. దీని కారణంగా ఓవర్ కూల్ కావడంతోపాటు బ్యాటరీ డ్రెయిన్ అవుతుంది. ఎలక్ట్రానిక్ కంపోనెట్స్ తేమ వచ్చి చెడిపోయే అవకాశముంటుంది. ఎలక్ట్రానిక్ వస్తువుల లోపల ఉండే చిప్‌లు మైనస్ టెంపరేచర్‌లో గట్టిపడి పనితీరు మందగిస్తుంది. అదే విధంగా ఎలక్ట్రానిక్ పరికరాలను హీటింగ్ పరికరాలకు దగ్గరగా ఉంచొద్దు. అది మొబైల్స్ పనితీరును ప్రభావితం చేస్తుంది. కీప్యాడ్ మొబైళ్లు కొంత బిగిసుకపోయే అవకాశం ఉంటుంది. మొబైల్ బాగా వేడయితే స్విచ్ఛాఫ్ చేయడం ఉత్తమం. మైనస్ టెంపరేచర్ ఉన్న సందర్భంలో కంప్యూటర్ల బ్యాటరీ, కంట్రాక్టులు సైతం ప్రభావితం అవుతాయి. మంచు కురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం చాలావరకు తగ్గించుకోవాలి.

క్లుప్తంగా

సర్వేయర్‌ను నియమించాలి

ఇబ్రహీంపట్నం: మండలంలో సర్వేయర్‌ను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు. భూసమస్యల పరిష్కారం కోసం సర్వే చేసేందుకు తహసీల్ కార్యాలయంలో 40 మంది దరఖాస్తులు చేసుకున్నారని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. సంవత్సరకాలంగా మండలానికి సర్వేయర్ లేకపోవడంతో రైతుల భూసమస్యలు పరిష్కారం కాక కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. సర్వే పనులు చేపట్టలేకపోతున్నారు.

లక్ష్యంతో ముందుకు సాగితేనే విజయం



క్రీడాసామగ్రితో విద్యార్థులు

మల్లాపూర్: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే ఒక సమున్నత లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగితే విజయం సొంతమవుతుందని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం వేంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ హెచ్‌ఎం పబ్బ నారాయణగౌడ్ స్మారకార్థం ఆయన కుమారుడు ఎస్సై కిరణ్‌కుమార్ రూ.10వేల విలువ గల క్రీడాసామగ్రిని అందజేశారు.

పాఠశాలలు తనిఖీ

వెల్గటూర్: జిల్లా విద్యాధికారి కె.రాము గురువారం మండలంలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిల్వాకోడూరు, చెగ్యాం, గుల్లకోట పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న తరగతుల తీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజన అమలు తీరునడిగి తెలుసుకున్నారు. గుల్లకోటలో పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల గురించి ఆరా తీసి పలు సూచనలు చేశారు.

వరి నాట్లు వేసిన విద్యార్థులు

కథలాపూర్: పోతారం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు గురువారం వరి నాట్లు వేశారు. మొక్కల నుంచి వచ్చే ఆహార ఉత్పత్తులు అనే పాఠంపై విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులు 8, 9తరగతుల విద్యార్థులను వరి నాట్లు వేసే పొలం వద్దకు తీసుకెళ్లారు. విద్యార్థులతో వరి నాట్లు వేయించారు. ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్ పులి శిరీష, హెచ్‌ఎం నరహరి, ఉపాధ్యాయులు రవి, నరేందర్ ఉన్నారు.

నేడు గంగాగౌరిశంకరుల కల్యాణం

ఇబ్రహీంపట్నం: ఎర్దండి గ్రామ శివారులోని గోదావరి వద్ద శుక్రవారం గంగాగౌరిదేవిశంకరుల కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. కల్యాణానికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాదముంటుందన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఇబ్రహీంపట్నం: ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో కోరుట్ల నియోజకవర్గం నుంచి గెలిచిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రణయ్‌తేజ, ఉపాధ్యక్షుడు కొడిమ్యాల దీపక్‌రాజ్ గురువారం ఇబ్రహీంపట్నంలో తహసీల్దార్ ప్రసాద్, ఎస్‌ఐ అనిల్‌కుమార్‌ను కలిసి సన్మానించారు. యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నల్లూరి సాగర్, ఉపాధ్యక్షుడు అబ్బ రాహుల్, నాయకులు కోటగిరి సిద్దార్థ, మండల సెక్రటరీ బీంకర్, అఖిల్, ముక్కెర శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరి నారును కాపాడుకోవాలి

ఇబ్రహీంపట్నం: చలి ప్రభావం నుంచి వరి నారును కాపాడుకోవాలని, ప్రస్తుతం చలి తీవ్రత అధికంగా ఉండి అల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో నారు సరిగా ఎదగదని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం వేములకుర్తి గ్రామంలో వరి నార్లను పరిశీలించారు. మండలంలో 8,500 ఎకరాల్లో రైతులు నార్లు పోసుకున్నారని, నార్లను కాపాడుకోవడానికి రైతులు సాయంత్రం వేళలో నీరు తీసి ఉదయం నీరందించాలని సూచించారు. ఏఈవో రవళిక, రైతులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మల్యాల: మండల కేంద్రానికి చెందిన వడ్డెపల్లి అనురాధ స్మారక క్రికెట్ టోర్నీ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని మార్కండేయ దేవాలయంలో మండల ప్రీమియర్ లీగ్–2ను సామాజిక కార్యకర్త వడ్డెపల్లి శశాంక్, ఎన్‌ఆర్‌ఐ వడ్డెపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని 8 క్రికెట్ జట్లు టోర్నీలో పాల్గొంటాయన్నారు. మిట్టపల్లి సుదర్శన్, దారం ఆదిరెడ్డి, బోడ గోవర్ధన్, బొట్ల ప్రసాద్, అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, మంద తిరుపతి, నేరెళ్ల శ్రావణ్, ఆగంతపు వంశీ, ఇమామ్, గాజుల మల్లేశం, మేడిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సుద్దపల్లి వాసికి డాక్టరేట్

పెగడపల్లి: సుద్దపల్లి గ్రామానికి చెందిన కోటగిరి జగన్‌గౌడ్ డాక్టరేట్ పట్టా పొందాడు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యాలయంలో పర్యావరణ శాస్త్రం విభాగంలో గురువారం డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. విశ్రాంత ఆచార్య ప్రొఫెసర్ మాణిక్యరెడ్డి పర్యవేక్షణలో ఎకలాజికల్ స్టడీస్ ఆఫ్ కాప్రా లేక్ విత్ రిఫరెన్స్ టూ వాటర్ అనే అంశంపై జగన్‌గౌడ్ సమర్పించిన సిద్ధాంత వ్యాసానికి డాక్టరేట్ లభించింది.

తప్పెవరిది..?

- డంపింగ్ యార్డులో ఆగని మంటలు
- ఫైర్ ఇంజన్‌తో ఆర్పే ప్రయత్నం



మంటలు చల్లార్చేందుకు జేసీబీతో పోస్తున్న మట్టి

జగిత్యాల: అధికారుల నిర్లక్ష్యం.. పట్టింపు లేనితనంతో జగిత్యాలలో డంపింగ్ యార్డు అంటుకొని నాలుగు రోజులవుతున్నా మంటలు ఆరడం లేదు. ఫైర్ ఇంజన్ వచ్చి మంటలార్పుతున్నా తగ్గడం లేదు. నాలుగు రోజుల క్రితం డంపింగ్ యార్డులో చెత్త ఏరుకునేవారంటించారా లేదా ప్రమాదవశాత్తు అంటుకున్నాయో తెలియదు కానీ తీవ్రత ఎక్కువగానే ఉంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోపోవడంతో శానిటేషన్ విభాగం అధికారులు మంటలార్పే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇష్టారాజ్యం..

చెత్త సేకరణ సమయంలో తడి, పొడి చెత్త వేరు చేయాలి. ప్లాస్టిక్, ఇతరత్రా వస్తువులను పడేస్తే కాలిపోయే అవకాశాలున్నాయి. ఎన్విరాన్‌మెంట్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎక్కడబడితే అక్కడ చెత్త వేయడంతో నిత్యం ఇంటి వద్దే తడి, పొడి చెత్త సేకరించాలని మేనేజ్‌మెంట్ నిబంధనల్లో ఉన్నా.. అది ఎక్కడ అమలు కావడం లేదు. ప్రస్తుతం ఈ డంపింగ్ యార్డులో ఇష్టానుసారంగా చెత్తను పోయడంతో అంటుకొని నాలుగు రోజులుగా మంటలు వ్యాపిస్తున్నాయి.

ప్రమాదపుటంచున నర్సింగాపూర్

డంపింగ్ యార్డును ఆనుకొని నర్సింగాపూర్ గ్రామంతోపాటు డబుల్ బెడ్‌రూం ఇళ్లున్నాయి. ఇప్పటికే దట్టమైన పొగలు కమ్ముకొని ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ఫైర్ ఇంజన్లతోపాటు చైన్ జేసీబీ సహాయంతో మట్టి కుప్పలు పోస్తున్నారు. అయినా దట్టమైన పొగలు వస్తున్నాయి. వ్యర్థాల నుంచి వస్తున్న పొగ కావడంతో ప్రజలకు శ్వాసకోశ సంబంధిత వ్యాధులు ఎదురయ్యే అవకాశముంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంటలార్పేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధిక ఖర్చు..

ఇప్పటికే ప్రజల సొమ్ము రాళ్లపాలు అన్న చందంగా ఉండగా.. ఇప్పుడు ఈ మంటలు ఆర్పేందుకు జేసీబీ, డీజిల్ పోసేందుకు అత్యధికంగా ఖర్చవుతోంది. నిత్యం మంటలార్పేందుకు అత్యధికంగా డీజిల్ పోస్తున్నట్లు తెలిసింది.



రాయికల్: పట్టణంలోని వైకుంఠధామంలో బోరు పని చేయక దహన సంస్కారాలు చేసిన కుటుంబ సభ్యులు స్నానాలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ శివారులోని చెరువులోకి వెళ్లి స్నానాలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం పట్టణంలోని రజక కులస్తుడైన బారస్ పెద్దిరాజు మృతిచెందగా.. కుటుంబ సభ్యులు, కులస్తులంతా కలిసి అంతిమ యాత్రలో పాల్గొని దహన సంస్కారాలు చేశారు. స్నానాలు చేసేందుకు కుళాయిల వద్దకు వెళ్లగా.. అందులోంచి నీరు రాలేదు. మున్సిపల్ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, సెల్ నం.: 7032118586

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం



మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో మాల సంఘం నాయకులు

మల్లాపూర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించి వెనక్కి తీసుకోవడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణపై ముందుకు వెళ్లొద్దని ఉద్యమిస్తున్న మాలలను రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో ముందస్తు అరెస్టు చేయించడం గర్హనీయమని మాల మహానాడు సంఘం జిల్లా నాయకుడు ఎల్కా కమలాకర్ అన్నారు. చలో అసెంబ్లీ పేరుతో ముట్టడికి తరలివెళ్తున్న మాల కుల సంఘం నాయకులు, సభ్యులను గురువారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో అర్ధరాత్రి నుంచే అదుపులోకి తీసుకొని ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బిట్ల నరేశ్, బోడ శేఖర్, జంగం దినేశ్, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో మాల సంఘం నాయకులను ఇబ్రహీంపట్నం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. మాల సంఘం మండలాధ్యక్షుడు దేవానందం, ప్రధాన కార్యదర్శి వినోద్, గౌరవాధ్యక్షుడు శ్రీను, ఉపాధ్యక్షుడు రవి, కోశాధికారి దివాకర్, నాయకులు ప్రకాశ్, గంగాధర్, శేఖర్, ఆనంద్, అశోక్, రాజం, రమణ, మురళి ఉన్నారు.

రాయికల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా మాల మహానాడు నాయకులు జాన గోపి, వేల్పుల ప్రవీణ్‌లను ఎస్సై సుధీర్ గురువారం ముందస్తుగా అరెస్ట్ చేసి ఠాణాకు తరలించారు.

కథలాపూర్: మండలంలోని మాల మహానాడు నాయకులను గురువారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్లకుండా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు. దయ్యు ప్రశాంత్, కోట శంకర్, కదారి స్వామి, బత్తుల నరేశ్, కూన శ్రీనివాస్, జంగం నరేశ్ ఉన్నారు.

పెగడపల్లి: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ చలో మాల చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్తున్న మాల మహానాడు సంఘం నాయకులను గురువారం స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. రాజయ్య, బత్తుల ప్రదీప్, అరుణ్, ఏసురత్నం, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

పరిహారం చెల్లించండి

కథలాపూర్: కలిగోట గ్రామ శివారులో గల సూరమ్మ ప్రాజెక్టు నుంచి కుడి ఎడమ కాలువ నిర్మాణం పనుల్లో కోల్పోతున్న భూములకు పరిహారం చెల్లించాలని అసెంబ్లీలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం ప్రస్తావించారు. శ్రీపాద ఎల్లంపెల్లి ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా వేములవాడ నియోజకవర్గంలోని ప్రాజెక్టులకు ఈనెల చివరి వరకు సాగునీరందించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. సూరమ్మ ప్రాజెక్టు కాలువ భూనిర్వాసితులకు పరిహారం త్వరగా చెల్లించాలని మంత్రికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. బొమ్మెన ప్రాజెక్టు ఆధునీకీకరణకు రూ.1.60కోట్లు మంజూరు చేయాలని కోరగా.. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీలో సానుకూలంగా స్పందించారన్నారు.

ఫిజికల్ సైన్స్ ఫోరం మండల అధ్యక్షుడిగా చిన్నయ్య

రాయికల్: ఫిజికల్ సైన్స్ ఫోరం మండల అధ్యక్షుడిగా బొల్లె చిన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా పొన్నం రమేశ్, ఉపాధ్యక్షురాలిగా పద్మ, కోశాధికారిగా పొత్తూరి రవీందర్ ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు మచ్చ రాజశేఖర్ గురువారం తెలిపారు.

మేడిపల్లి: భీమారం మండల పరిధి వివిధ గ్రామాల్లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్న ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల ఫోరం అధ్యక్షుడిగా భీమారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జవ్వాజి అశోక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రెగ్యులర్ చేయాలి

జగిత్యాలటౌన్: ఇరవై ఏళ్లుగా సేవలందిస్తున్న తమను రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలని రెండో ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ సమీపంలో 48గంటల నిరసన కార్యక్రమం చేపట్టారు. తామంతా 45ఏళ్లకు పైబడిన వాళ్లమేనని, పోటీ పరీక్షలు రాసే పరిస్థితి లేదని, దశాబ్ద కాలంగా చేస్తున్న తమ పోరాటాలను దృష్టిలో ఉంచుకుని రెగ్యులర్ చేసేందుకు గత ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలోని ముగ్గురు ఉన్నతాధికారులతో త్రిసభ్య కమిటీ వేసిందని గుర్తు చేశారు.

మొగిలయ్య మృతి తీరని లోటు

జగిత్యాలటౌన్: జానపద గాయకుడు, తంబురా వాయిద్యకారుడు, బలగం చిత్రం ఫేం పస్తం మొగిలయ్య మృతి జానపద కళారంగానికి తీరని లోటని కళాశ్రీ అధినేత గుండేటి రాజు సంతాపం వ్యక్తం చేశారు. మొగిలయ్య కుటుంబాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి



ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతున్న శేఖర్

ఇబ్రహీంపట్నం: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు బట్టు శేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ సంఘం వద్ద మాట్లాడారు. వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని అన్నారు. గుజ్జెరి ప్రకాశ్, రమణ, వినోద్, దేవానందం, ఆనంద్, అశోక్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: అంబేడ్కర్‌పై అమిత్‌షా వివాదాస్పద వ్యాఖ్యలు గర్హనీయమని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పూలేరి రాము అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంఘం నాయకులతో కలిసి నిరసన తెలిపారు. యూత్ ఉపాధ్యక్షుడు నల్ల లక్పతి, కోశాధికారి పెద్దిరెడ్డి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి బూరం వంశీ, రైటర్ ఆకుతోట నర్సయ్య, సభ్యులు నల్ల రాజేశ్వర్, మాట్ల సోమయ్య, కొంపెల్లి రాకేశ్, రామలక్ష్మణ్, మాట్ల శ్రీనివాస్, అంజయ్య, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: అంబేడ్కర్‌ను కించపరిచేలా మాట్లాడిన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పెగడపల్లిలో అంబేడ్కర్ విగ్రహ వద్ద నివాళి అర్పించి నిరసన వ్యక్తం చేశారు. ప్రదీప్, రాజయ్య, అంజయ్య, చంద్, సంజీవ్, లక్ష్మణ్, స్వామి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ పట్టణంలోని మండల పరిషత్ పార్కులో అంబేడ్కర్ విగ్రహం ఎదుట భారత్ ముక్తి మోర్చా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. దయ్య రాజారాం, బత్తుల లక్ష్మణ్, గోరుమంతుల సురేందర్, నీరటి రాజేందర్, సోమిడి శ్యాం, మద్దెల లక్పతి, మేకల ఉపేంద్ర తదితరులున్నారు.

నిలిచిన నీటి సరఫరా

జగిత్యాల: ధర్మసముద్రంలో నీరు అడుగంటడంతో పట్టణంలో రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నారు. జగిత్యాలకు వరప్రదాయిని అయిన ఈ ధర్మసముద్రం రిజర్వాయర్‌ను ఎస్సారెస్పీ నీటితో నింపుతారు. ఒకసారి నింపితే దాదాపు ఆర్నెళ్ల వరకు తాగునీటికి ఢోకా ఉండదు. మిషన్ భగీరథ ద్వారా నీరు అందుతుండడంతో డబ్బా నుంచి వచ్చే మెయిన్ పైప్‌ను ఇక్కడ ఫిల్టర్‌బెడ్‌కు అనుసంధానం చేశారు. ఆ నీటినే ఎక్కువగా సరఫరా చేస్తున్నారు. ఇటీవల మిషన్ భగీరథ నీరు మరమ్మతు నేపథ్యంలో సక్రమంగా రావడం లేదు. అవి రాకపోవడం, ధర్మసముద్రంలో నీరు అడుగంటిపోవడంతో ఇబ్బందిగా మారింది. అధికారులు కొత్త బస్టాండ్ ట్యాంక్, తీన్‌ఖని, హౌసింగ్‌బోర్డుల్లోని ట్యాంక్ పరిధిల్లోని కాలనీలకు రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు. కొందరు ట్యాంకర్ నీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ధర్మసముద్రం నింపుతాం

ధర్మసముద్రంలో నీటి మట్టం తగ్గింది. ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడి రెండుమూడు రోజుల్లో నింపేలా చర్యలు తీసుకుంటాం. భగీరథ నీరు తక్కువగా రావడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. – చిరంజీవి, కమిషనర్

కొడుకులపై ఫిర్యాదు

జగిత్యాల: తమను తమ కొడుకులు పోషించకపోవడంతోపాటు వేధింపులకు గురి చేస్తున్నారని పెగడపల్లి మండలం దీకొండకు చెందిన వెంకట్ ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సీనియర్ సిటిజన్ సంఘం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్‌ను కలిసి వివరించారు. పొలాన్ని కౌలుకివ్వగా.. సాగు చేసుకోకుండా అడ్డుకుంటున్నారని, చిన్న కొడుకులు కొడుతున్నారని, రక్షణ కల్పించాలని కోరారు.

సదస్సు విజయవంతం చేయాలి

జగిత్యాల: ఈనెల 21న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే కళాకారుల సదస్సును విజయవంతం చేయాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా చైర్మన్ జువ్వాజి శంకర్ అన్నారు. గురువారం సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి నాచుపల్లి రెడ్డి, ఉద్యమకారులు రాజు, తన్నీరు సత్యంరావు, రాజిరెడ్డి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఖేల్

ఆలిండియా ఖోఖో పోటీలకు ఎంపిక



మల్లేశంను అభినందిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తుడి మల్లేశం ఆగస్టు 18న జరిగిన తెలంగాణ పోలీస్ ఖోఖో సెలక్షన్ విభాగంలో జిల్లా పోలీసు శాఖ తరఫున పాల్గొని పంజాబ్ రాష్ట్రంలో జరిగే ఆలిండియా ఖోఖో పోలీస్ క్రీడలకు ఎంపికయ్యారు. తెలంగాణ పోలీస్ శాఖ నుంచి ఖోఖో విభాగంలో ఆలిండియా పోలీస్ క్రీడలకు ఎంపిక కాగా.. గురువారం ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు. రిజర్వ్ సీఐలు కిరణ్‌కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

జగిత్యాలరూరల్: సీఎం కప్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో కండ్లపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి రేవంత్ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ వినిత్, అజీమ్ తెలిపారు. ప్రిన్సిపాల్ సరితదేవి, వైస్ ప్రిన్సిపాల్ నగేశ్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఫుట్‌బాల్ పోటీలకు..

ధర్మపురి: సీఎం కప్ పోటీల్లో భాగంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు గ్రామీణ విద్యార్థి ఎంపికయ్యాడు. జైనా గ్రామానికి చెందిన సంగెపు మనోజ్‌కుమార్ రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో మెమొంటో, ప్రశంసాపత్రం అందించారు.

బహుమతులు అందజేత

జగిత్యాలటౌన్: సీఎం కప్ పోటీల్లో భాగంగా గురువారం పట్టణంలోని స్వామి వివేకానంద మినీ స్టేడియంలో అథ్లెటిక్, యోగా, కిక్ బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా యువజన క్రీడల అధికారి రవికుమార్, పెటా జిల్లా అధ్యక్షుడు పడాల విశ్వప్రసాద్, క్రీడల కార్యదర్శి లక్ష్మీరాంనాయక్, పీఈటీలు పడాల కృష్ణప్రసాద్, అజయ్‌బాబు, సుధాకర్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

మల్యాల: తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థులు సీఎం కప్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చారు. అథ్లెటిక్స్ విభాగంలో ఆర్.మనీష 3 కిలోమీటర్ల రన్నింగ్‌లో మొదటి స్థానంలో, 1500 మీటర్ల పోటీలో ద్వితీయ స్థానంలో నిలవగా, కె.మనుస్మృతి 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో, బి.దివ్య 400 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచింది. యోగా జూనియర్ బాలికల విభాగంలో డి.సౌజన్య ప్రథమ స్థానంలో, సబ్ జూనియర్ బాలికల విభాగంలో టి.కమలిని మొదటి స్థానంలో, బి.శ్రీవర్షిణి ద్వితీయ స్థానంలో, టి.రిత్విక్‌శ్రీ తృతీయ స్థానంలో నిలిచారు. ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక అభినందించారు.

రాష్ట్రస్థాయిలో గుర్తింపు తేవాలి

సారంగాపూర్: సీఎం కప్ క్రీడల్లో రాష్ట్రస్థాయిలో మండలానికి మరింత గుర్తింపు తేవాలని ఎంఈవో కిషోర్ సూచించారు. సీఎం క్రీడల్లో భాగంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన సారంగాపూర్ విద్యార్థి అల్లెపు రాజవర్ధన్‌తోపాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఖోఖో జట్టు బాలికలను సారంగాపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో నాయకులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, నాయకులు కోంద్ర రాంచంద్రారెడ్డి, ఆసాది హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రతి నర్సరీలో ఈత మొక్కలు

సారంగాపూర్: మండలంలోని ప్రతి వన నర్సరీలో ఈత మొక్కలు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో గంగాధర్ తెలిపారు. గురువారం రేచపల్లి నర్సరీని పరిశీలించారు. 18 గ్రామాల్లోని నర్సరీల్లో బ్యాగుల్లో మట్టి నింపడం పూర్తయిందని, ప్రస్తుతం బ్యాగుల్లో విత్తనాలు నాటుతున్నట్లు తెలిపారు. ప్రతి నర్సరీలో వెయ్యి ఈత మొక్కలు పెంచాలని ప్రభుత్వం సూచించిందని, 18 నర్సరీల్లో 18వేల ఈత మొక్కలు పెంచడానికి ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈజీఎస్ ఏపీవో శ్రీలత, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రకాశ్ తదితరులున్నారు.

బీజేపీ బూత్ అధ్యక్షులకు సన్మానం

జగిత్యాలటౌన్: బీజేపీ సంస్థాగత పర్వం(2024)లో భాగంగా పట్టణ బూత్ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన దూరిశెట్టి మమత, మేడిపల్లి పుష్పరెడ్డిలను రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ ధర్మారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి ఘనంగా సన్మానించి అభినందించారు. పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, నాయకులు మ్యాన మహేశ్, రాగిళ్ల సత్యనారాయణ, యాదగిరి బాబు, గాదాసు రాజేందర్, మామిడాల రాజగోపాల్, కాశెట్టి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మన ఇసుక వాహనంపై సమావేశం

కథలాపూర్: కథలాపూర్ రైతు వేదికలో మన ఇసుక వాహనంపై ట్రాక్టర్ యజమానులతో తహసీల్దార్ వినోద్ గురువారం సమావేశం నిర్వహించారు. కమర్షియల్ ట్రాక్టర్ ఉన్నవారు రూ.10వేలు డీడీ తీసి ట్రాక్టర్ వివరాలు మీసేవలో నమోదు చేసుకోవాలన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌ఐ నాగేశ్ ఉన్నారు.

బ్రహ్మకుమారి విద్యాలయం ప్రారంభం

కోరుట్ల రూరల్: కల్లూరు గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన బ్రహ్మకుమారి ఈశ్వరీయ దివ్య విద్యాలయ భవనాన్ని గురువారం ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. వర్తమాన సమాజంలో సమాజ హితం కోసం బ్రహ్మకుమారీలు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, కోరుట్ల బ్రహ్మకుమారి స్థానిక సంచారకులు బీకే రాజేశ్వరి, తెలుగు రాష్ట్రాల ముఖ్య ప్రతినిధి రాజయోగినీ కులదీప్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్లేకుండా నమోదు చేయాలి

ధర్మపురి: ఇందిరమ్మ గృహాల ఎంపికలో తప్పుల్లేకుండా నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. పట్టణంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును పరిశీలించారు. ఇళ్ల నమోదు పారదర్శకంగా ఉండాలన్నారు. పట్టణంలోని పలు దుకాణాల్లో ప్లాస్టిక్ విక్రయాలు చేస్తున్నారని తెలుసుకొని విక్రయదారులకు జరిమానా విధించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, ఇంజనీర్ మహేశ్, సిబ్బంది ఉన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

జగిత్యాల: కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని బీఎంఎస్ నాయకులు అన్నారు. బీఎంఎస్ వార్షిక వేడుకల్లో భాగంగా పోస్టర్ ఆవిష్కరించారు. ప్రభుత్వం వేతన, ఉద్యోగ భద్రత కల్పించి సామాజిక భద్రత కోసం హెడ్‌లోడ్ వర్కర్స్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ స్టేట్ బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిల్వర్ కిష్టయ్య, బీఎంఎస్ కార్యదర్శి సత్యనారాయణ, శ్రీనివాస్‌యాదవ్, అశోక్ ఉన్నారు.

దుప్పట్లు పంపిణీ

మల్యాల: తాటిపల్లి బాలికల గురుకుల కళాశాల విద్యార్థులకు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజ్‌కుమార్ 650 విద్యార్థులకు దుప్పట్లు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మానస, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.